క్లుప్తంగా

సర్పంచ్ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



అప్పలనాయుడిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్, పార్టీ నాయకులు

నర్సీపట్నం : మండలంలోని నీలంపేటకు చెందిన భార్య,భర్తలైన తాజా, మాజీ సర్పంచ్‌లు పెట్ల సత్యవతి, అప్పలనాయుడు కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ శనివారం పరామర్శించారు. అప్పలనాయుడు తల్లి నూకాలతల్లి ఈ నెల 8వ తేదీన అనారోగ్యంతో మృతి చెందారు. గణేష్ వెంట వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు శానపతి వెంకటరత్నం, వైస్‌ఎంపీపీ తాతబాబు, నియోజకవర్గ బూత్ కోఆర్డినేటర్ సుర్ల చంద్రశేఖర్ ఉన్నారు.

ఈవోపీఆర్‌డీగా మేరీజోన్స్

మాకవరపాలెం: ఈవోపీఆర్‌డీగా మేరీజోన్స్ విధుల్లో చేరారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఈవోపీఆర్‌డీ సీతామహాలక్ష్మి బదిలీపై వెళ్లారు. కోటవురట్ల మండలంలో కార్యదర్శిగా పనిచేస్తున్న మేరీజోన్స్ పదోన్నతిపై ఈవోపీఆర్‌డీగా శనివారం బాధ్యతలు చేపట్టారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

నర్సీపట్నం : ప్రభుత్వ డిగ్రీ కళాశాల వారు అరబిందో ఫార్మా కంపెనీవారు శనివారం నిర్వహించిన జాబ్ మేళాకు నిరుద్యోగ యువతి, యువకుల నుంచి విశేష స్పందన లభించింది. హైదరాబాద్, వైజాగ్, నాయుడుపేట, జడ్చర్ల పరిసర ప్రాంతాల్లో పని చేసేందుకు బీఎస్సీ,ఎంఎస్సీ, బీఫార్మసీ, ఐటీఐ ఉత్తీర్ణత కలిగిన 100 మంది నిరుద్యోగులు జాబ్ మేళాకు హాజరయ్యారు. ఎంపికైన విద్యార్థులకు వెంటనే కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు, కంపెనీ ప్రతినిధుల చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. అరబిందో కంపెనీ వారు కల్పించిన అవకాశాన్ని ఎంపికైన అభ్యర్థులు వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

చింతపాక రోడ్డుకు శంకుస్థాపన



రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజు

బుచ్చెయ్యపేట : మండలంలో గల గున్నెంపూడి,పెదమదీన రోడ్డు నుంచి చింతపాకకు వెళ్లే రోడ్డు పునః నిర్మాణానికి ఎమ్మెల్యే కె.ఎస్.ఎస్. ఎస్ రాజు శంకుస్థాపన చేశారు. నా బార్డు నిధులు సుమారు కోటి రూపాయలతో రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి శనివారం సాయంత్రం ఎమ్మెల్యే నాయకులతో కలిసి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

రావికమతం : కొత్తకోట నుంచి జెడ్.కొత్తపట్నం ప్రత్యామ్నాయ రోడ్డును రూ.70లక్షలతో తారు రోడ్డుగా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నట్టు ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు చెప్పారు. శనివారం రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. డీఈఈ శ్రీహరి, ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

దేవరాపల్లి ఎస్‌ఐగా సత్యనారాయణ



దేవరాపల్లి : దేవరాపల్లి ఎస్‌ఐగా వి.సత్యనారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎస్‌ఐగా పని చేసిన టి.మల్లేశ్వరరావు అనకాపల్లికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో పరవాడ నుంచి సత్యనారాయణ బదిలీపై వచ్చారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణకు సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు.

'ఆ వ్యాఖ్యలు ఖండిస్తున్నాం'

మాకవరపాలెం : కలెక్టర్‌పై మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ చేసిన వ్యాఖ్యలను తహసీల్దార్ వెంకటరమణ విలేకరుల సమావేశంలో ఖండించారు. మండలంలోని యరకన్నపాలెం నుంచి యలమంచిలి మండలం పెదపల్లికి ఇటీవల వేసిన రోడ్డును గురువారం ఉమాశంకర్‌గణేష్ పరిశీలించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ రోడ్డు వ్యవహారంలో కలెక్టర్, ఆర్డీవోలపై చేసిన వ్యాఖ్యలను శనివారం తహసీల్దార్ ఖండించారు. తమను అడిగితే రోడ్డుకు సంబంధించి వివరాలు తెలిపేవాళ్లమని పేర్కొన్నారు. ఆయన వెంట డీటీ నూకరాజు ఉన్నారు.

అచ్చిరాజుకు స్పీకర్ నివాళి



అచ్చిరాజు సంతాప సభలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నాతవరం : రాజకీయ నాయకులు సామాజిక దృక్పథంలో పని చేస్తే సమాజంలో ఎల్లప్పుడు గుర్తింపు పొందుతారని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. మర్రిపాలెం పంచాయతీ శివారు వెన్నలపాలెం గ్రామానికి చెందిన లాలం అచ్చిరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌తో పాటు పలు పదవులు నిర్వహించారు. శనివారం ఆయన సంతాప సభ నిర్వహించగా అచ్చిరాజు చిత్రపటం వద్ద స్పీకర్ నివాళులు అర్పించారు.

తమ్ముళ్లకూ నకిలీల సెగ!

- ఒక్క గింజైనా మొలకెత్తని ఆకుమడులు
- ప్రభుత్వం సరఫరా చేసిన విత్తనాలపై టీడీపీ నేతల ఆగ్రహం
- క్షేత్ర స్థాయిలో పరిశీలించి విస్తుపోయిన వ్యవసాయాధికారి



కొండపాలెంలో ఒక్క గింజ మొలకెత్తని సర్పంచ్ భవానీకి చెందిన ఆకుమడి



బంగారుమెట్టలో రమేష్‌కు చెందిన ఆకుమడిని పరిశీలిస్తున్న ఏవో భాస్కరరావు

బుచ్చెయ్యపేట : నకిలీ విత్తనాల బెడద బుచ్చెయ్యపేట మండలంలో పలు గ్రామాల్లో బయట పడుతుంది. అధికారపార్టీ నాయకులే నకిలీ విత్తనాలకు బలైపోయారు. రైతు సేవా కేంద్రాల్లో వీరు కొనుగోలు చేసిన ఆర్‌జీఎల్ రకం వరి విత్తనాలు నకిలీవని తెలిసి ఆగ్రహం చెందుతున్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన ధాన్యంలో ఒక్క ధాన్యం గింజ మొలకెత్తకపోవడంపై టీడీపీ నాయకులే విస్తుపోతున్నారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, బుచ్చెయ్యపేట మండల టీడీపీ అధ్యక్షుడు ఎం.వి.వి. సత్యనారాయణకు చెందిన పొలాల్లో ప్రభుత్వం సరఫరా చేసిన ఆర్‌జీఎల్ రకం విత్తనాలు వేయగా ఒక్క గింజ కూడా మొలకెత్తలేదు. టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ తమ్ముడు తాతయ్యలు గతంలో సర్పంచ్‌గా పని చేయగా ప్రస్తుతం తాతయ్య భార్య భవానీ కొండపాలెం సరంచ్‌గా పని చేస్తున్నారు. గ్రామ రైతు సేవా కేంద్రంలో కొనుగోలు చేసిన రెండు ఆర్‌జీఎల్ ధాన్యం బస్తాలు వేయగా ఒక్కటీ మొలకెత్తలేదని తాతయ్యలు వాపోయారు. అలాగే రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు మేనల్లుడు దొండా రమేష్ కూడా లోపూడి రైతు సేవా కేంద్రంలో ఆర్‌జీఎల్ రకం వరి విత్తనాలు కొనుగోలు చేశారు. అతను ఆకు వేసి పది రోజులు దాటినా ఒక్కటీ నాటలేదు. మాకు సరఫరా చేసిన నకిలీ విత్తనాల వల్ల తీవ్రంగా నష్టపోయామని వ్యవసాయశాఖ సిబ్బందికి టీడీపీ నాయకులు నేరుగా ఫిర్యాదు చేశారు. దీనిపై మండల వ్యవసాయశాఖ అధికారి భాస్కరరావు బంగారుమెట్ట దొండా రమేష్ పొలంలోకి వెళ్లి ఆకుమడి పరిశీలించగా కనీసం ఒక్క ధాన్యం గింజ మొలకెత్తకపోవడాన్ని చూసి ఆయన ఆశ్చర్యపోయారు. తన 35 ఏళ్ల సర్వీస్‌లో ఇలా ఒక్క గింజ కూడా నాటని ఆకుమడిని ఇపుడే చూస్తున్నానని అనడంతో అక్కడ ఉన్న రైతులు విస్తుపోయారు. రైతుల సమక్షంలోనే ఫొటోలు తీసి పై అధికారులకు, విత్తనాలు సరఫరా చేసిన ఏపీ సీడ్స్ కంపెనీ సిబ్బందికి సమాచారం అందించారు. ఇప్పటికే వడ్డాదిలో ప్రైవేటు వ్యాపారి వద్ద నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి సరిగా నాటక పలువురు రైతులు మోసపోయారు. మంగళాపురం, విజయరామరాజుపేట గ్రామాల రైతు సేవా కేంద్రాలకు వచ్చిన నకిలీ విత్తనాలను అధికారులు వెనక్కి పంపించారు. ఇప్పటికే పెరిగిన వ్యవసాయ పెట్టుబడులతో, పంటలకు గిట్టుబాటు ధర లేక ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించక అప్పుల్లో కూరుకుపోతున్న రైతులకు ప్రభుత్వం చేసిన నకిలీ విత్తనాలు సరఫరా గుదిబండగా మారింది. ప్రభుత్వంపై పలు గ్రామాల రైతులు తీవ్ర ఆగ్రహం చెందుతున్నారు. నకిలీ విత్తనాలు సరఫరా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని పలు గ్రామాల బాధిత రైతులు కోరుతున్నారు.

చోడవరంలో భారీ వర్షం

నారుమడులకు ఊపిరి పోస్తుందని రైతుల ఆశాభావం



చోడవరంలో కురుస్తున్న వర్షం

చోడవరం : వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులకు తనివితీరా భారీ వర్షం కురిసింది. వరి విత్తనాలు వేసిన తర్వాత సరైన వర్షం పడక ఆకుమడులకు, నారుమడుల దుక్కులకు నీరులేక రైతులు అల్లాడుతున్న సమయంలో రెండ్రోజులుగా భారీ వర్షాలు కురిశాయి. శనివారం సాయంత్రం కురిసిన కుండపోత వర్షం రైతులకు చాలా మేలుచేసింది. చోడవరం పరిసర ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో ఇప్పటి వరకు ఎండలకు అల్లాడిన జనం ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. భారీ ఉరుములు మెరుపులతో కుండపోతగా కురిసిన వర్షంతో పలు లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. లోతట్టు ప్రాంతాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. మరోపక్క చెరకు మొక్కతోటలకు, అపరాలు, కూరగాయాల పంటలకు ఈ వర్షం ఊపిరి పోసింది. నీరులేక ఎదగకుండా ఉండిపోయిన నారు మడులకు, దమ్ముపట్టేందుకు సిద్ధంగా ఉన్న పొలాలకు వర్షం మేలుచేసింది. సాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్న సమయంలో వర్షం పడడంపై రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

కె.కోటపాడు : మండలంలో పలు గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. వర్షాభావంతో నారు మడులు ఎండిపోయే దశకు చేరుకున్న దశలో భారీ వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పల్లపు ప్రాంత గ్రామాల్లో అడపాదడపా జరుగుతున్న దమ్ములకు ఈ వర్షంతో ఉపయోగపడుతుందని రైతులు తెలుపుతున్నారు.

సచివాలయ సిబ్బందికి వీడ్కోలు సత్కారం



పొంగలిపాకలో సచివాలయ సిబ్బందిని సన్మానించిన ఎంపీడీవో అప్పారావు, తదితరులు

మాడుగుల రూరల్ : పొంగలిపాక సచివాలయంలో విధులు నిర్వహిస్తూ బదిలీ అయిన సిబ్బందికి శనివారం వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎంపీడీవో కొంకి అప్పారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సచివాలయానికి కొత్తగా వచ్చిన సిబ్బందిని, బదిలీ అయిన సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాయిన దేముడమ్మ, సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు మైచర్ల సన్యాసిరావు, కింతలి పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఉండూరు దేముడుతో పాటు నీటి సంఘాల అధ్యక్షులు, పాలసొసైటీ అధ్యక్షుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బోయిలకింతాడలో ఎరువుల పంపిణీ



ఎరువులను పంపిణీ చేస్తున్న సర్పంచ్ బాబూరావు

దేవరాపల్లి: ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా రాయితీపై సరఫరా చేస్తున్న ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు అన్నారు. ఈ మేరకు బోయిలకింతాడ రైతు సేవా కేంద్రంలో ప్రభుత్వం సరఫరా చేసిన ఎరువుల బస్తాలను ఆయన చేతుల మీదుగా శనివారం అందజేశారు.

ఉత్తమ బోధనతో మెరుగైన ఫలితాల సాధన



మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు

కె.కోటపాడు : విద్యార్థులకు మంచి విద్యాబోధనను అందించడం ద్వారా వారి నుంచి ఉత్తమ ఫలితాలను సాధించాలని అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి జి.అప్పారావునాయుడు అన్నారు. చౌడువాడ హైస్కూల్లో శనివారం ఉపాధ్యాయులకు నిర్వహించిన క్లస్టర్ మీటింగ్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. చక్కని ప్రణాళికలు, తగిన కృత్యాల ద్వారా బోధన జరపాలని ఉపాధ్యాయులకు సూచించారు. చదువుల్లో వెనుకబడ్డ విద్యార్థులను గుర్తించి, వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పాఠశాలలో విద్యార్థుల హాజరు శతశాతం ఉండేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. మండల విద్యాశాఖాధికారులు కె.సత్యనారాయణ, ప్రసాద్, హెచ్‌ఎం కె.రాజు పాల్గొన్నారు.

ప్రతి పశువుకూ థైలీరియా టీకాలు వేయించాలి..



వ్యాక్సిన్‌ల వివరాలను పరిశీలిస్తున్న డీడీ చంద్రశేఖర్

కె.కోటపాడు : పాడి రైతులు పోషక విలువలు ఎక్కువగా ఉండే పశుగ్రాసం పెంపకాన్ని చేపట్టాలని ఉమ్మడి విశాఖ జిల్లా పశుసంవర్థకశాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మండలంలో కొరువాడ పశువైద్య కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.అధిక పాల దిగుబడి ఇచ్చే ఆవుల్లో థైలేరియా వ్యాధి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. దీని నివారణకు వ్యాక్సిన్‌ను ఉచితంగా వేస్తున్నట్టు తెలిపారు. కె.కోటపాడు మండలానికి థైలేరియా వ్యాక్సిన్ 6600 డోసులు వచ్చినట్టు తెలిపారు. కె.కోటపాడు పశుసంవర్థకశాఖ ఏడీ దినేష్‌కుమార్, పశువైద్యాధికారి సింహాచలంనాయుడు, వెటర్నరీ అసిస్టెంట్ వరలక్ష్మి, దేముడుబాబు పాల్గొన్నారు.

ఉచిత గర్భకోశ వైద్య శిబిరం

పాడి రైతులు పశువైద్య సిబ్బంది వివరించే జాగ్రత్తలను తప్పకుండా పాటించాలని పశుసంవర్థకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ అన్నారు. చౌడువాడలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, చౌడువాడ పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు ఆధ్వర్యంలో శనివారం ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. చౌడువాడ పశువైద్యాధికారి సిహెచ్. వై. నాయుడు, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ పశువైద్యాధికారి ఎస్.సౌజన్య ఈ వైద్య శిబిరంలో 67 పశువులకు గర్భకోశ చికిత్సలు అందించారు. శిబిరాన్ని వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ రాజేష్ ప్రారంభించారు.

దేవరాపల్లి : సంకరజాతి పశువులకు థైలేరియా టీకాలు తప్పనిసరి అని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరక్టర్ డా. చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని తెనుగుపూడిలో జరుగుతున్న థైలేరీయా టీకా కార్యక్రమాన్ని శనివారం తనిఖీ చేశారు. గోమార్లు కుట్టడం ద్వారా థైలేరీయా సోకుతుందని, ఈ వ్యాధి సోకిన పశువుల్లో తీవ్ర జ్వరం తదితర లక్షణాలు ఉంటాయన్నారు. అందువల్ల దీని నివారణకు టీకాలు వేయించాలన్నారు. ఆయన వెంట కె.కోటపాడు సహాయ సంచాలకుడు దినేష్‌కుమార్, పశువైద్యాధికారి గాయిత్రీ దేవి, పశువైద్య సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీ టీచర్ మృతికి సంతాపం



మృతురాలు జగదీశ్వరి(ఫైల్)

నర్సీపట్నం: మండలంలో ఒ.ఎల్.పురానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ టి.జగదీశ్వరి(49) మృతి చెందారు. శుక్రవారం యధావిధిగా అంగన్‌వాడీ సెంటర్‌కు వచ్చిన ఆమె అక్కడ అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు వెంటనే నర్సీపట్నంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సీడీపీవో జి.వి.రమణి, అంగన్‌వాడీ సిబ్బంది జగదీశ్వరి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

వీఆర్వో మృతికి సంతాపం



ఎం.ఈశ్వరరావు(ఫైల్)

బుచ్చెయ్యపేట : కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న బుచ్చెయ్యపేట వీఆర్వో మెలిపాక ఈశ్వరరావు(55) విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. అతని భౌతికాయాన్ని మాడుగుల మండలం చింతలూరుకు తీసుకువచ్చారు. బుచ్చెయ్యపేట తహసీల్దార్ ఎం.లక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీరామూర్తి, వీఆర్వోలు జె.వి. రమణ, సుధాకర్, రాము తదితరులు ఈశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. దహన ఖర్చుల కింద రూ.25 వేల నగదును తహసీల్దార్ లక్ష్మి మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

దుకాణాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలి



దేవరాపల్లిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న మండల ప్రత్యేక అధికారి మంజులవాణి

దేవరాపల్లి : దుకాణాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని మండల ప్రత్యేక అధికారి ఎస్.మంజులవాణి సూచించారు. దేవరాపల్లిలో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన రహదారిలో ఉన్న దుకాణాలను తనిఖీ చేసి, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. దుకాణాల్లో ఇకపై ప్లాస్టిక్ కవర్‌లను వినియోగిస్తే జరిమానా విధిస్తామన్నారు. నాలుగు రోడ్ల కూడలి అధికారులతో కలిసి మానవహారంగా ఏర్పడి ప్లాస్టిక్ వినియోగించకూడదని ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ పి.లక్ష్మీదేవి, మండల పరిషత్ పరిపాలన అధికారి డి.వి.లక్ష్మీనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో వరప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.చంద్రశేఖర్, హౌసింగ్ ఇంచార్జ్ ఏఈ ఎస్.భవ్యతేజ, వెలుగు ఏపీఎం ఎస్.ప్రభాకర్, స్థానిక పంచాయతీ కార్యదర్శి అనంత ఉమాదేవి, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ వి.పి.వి.త్రినాథ్ పాల్గొన్నారు. బోయిలకింతాడలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బాబూరావు పాల్గొన్నారు. స్థానిక అధికారులు, గ్రామస్తులతో కలిసి చెత్తా చెదారం సేకరించి చెత్త సంపద కేంద్రానికి తరలించారు. ప్లాస్టిక్ వాడొద్దని ప్రజలతో కలిసి ప్రతిజ్ఞ చేశారు.

గొలుగొండ : ప్లాస్టిక్ వాడకం మానుకోవాలని, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు ప్రతి గ్రామంలో అవగాహన కల్పించాలని ఎస్‌ఐ తారకేశ్వరరావు తెలిపారు. శనివారం జూనియర్ కళాశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు.

రావికమతం : రావికమతంలో శనివారం ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి వసంతరావు, ఎంపీడీవో వెంకన్నబాబు, తహసీల్దార్ అంబేడ్కర్, డిప్యూటీ ఎంపీడీవో సీతారామస్వామి, ఎంఈవో -2 బ్రహ్మాజీ, వివిధ శాఖల ఉద్యోగులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు.

మాకవరపాలెం : పీహెచ్‌సీ ఆవరణలో అవంతి కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ యూనిట్ విద్యార్థులు పరిసరాలు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ రెడ్ క్రాస్ సమన్వయకర్తలు హరికిరణ, గణేష్, రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

మంగళాపురం ఎంపీటీసీ మృతి



బుచ్చెయ్యపేట : మండలంలో గల మంగళాపురం ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకురాలు పత్తి అప్పలనర్స(54) మృతి చెందారు. కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆమె విశాఖలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెకు భర్త క్రిష్ణతో పాటు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె మృతి పట్ల మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, జడ్పీటీసీ రాంబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, సర్పంచ్ కంటే వెంకట పద్మరేఖ, దుద్దు రమణ సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం అప్పలనర్స అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

గొలుగొండ : ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చడంలో సీఎం చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారని, ఈ కూటమి నాయకులు ప్రజలను ఎలా మోసం చేశారో ప్రజల ముందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు అంతా తీసుకువెళ్లాలని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పిలుపునిచ్చారు. గొలుగొండ మండలం ఎర్రవరం రాజులుబాబు గుడి వద్ద బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమం శనివారం సాయంత్రం నిర్వహించారు. 29 పంచాయతీల నుంచి పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు, నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉమాశంకర్ గణేష్ మాట్లాడుతూ ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేసిన చంద్రబాబు ప్రభుత్వానికి ప్రజలు త్వరలో గుణపాఠం చెబుతారన్నారు. నిరుద్యోగి భృతి కల్పిస్తామని చెప్పి గొలుగొండ మండలంలో వేల మంది నిరుద్యోగులను మోసం చేశారని, నర్సీపట్నం నియోజకవర్గంలో తల్లికి వందనం పథకంలో 40వేల మందికి అర్హత కలిగి ఉంటే కేవలం 27 వేల మందికి మాత్రమే అందించారని అన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో మండలంలో 8వేల మంది రైతులకు ఒక్క రుపాయి కూడా ఇవ్వలేదని,ఆడబిడ్డ నిధి పథకంలో బాగంగా మండలంలో 18 వేల మంది 19-59 సంవత్సరాలు మహిళలు ఉన్నారని వారికి ఒక్కొక్కరికీ నెలకు రూ.15వందలు ఇస్తామని చెప్పి మోసగించారన్నారు. ఉచిత బస్ పథకం ఊసే ఎత్తడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజలకు 50 సంవత్సరాలు దాటిన వారికి పింఛన్లు ఇస్తామని హామీ ఇచ్చి అన్ని వర్గాల ప్రజలను మోసగించారన్నారు. వైఎస్సార్‌సీపీ గ్రామ స్థాయి కమిటీల్లో భాగంగా నియోజకవర్గంలో 90 శాతం పూర్తి కాగా గొలుగొండ మండలంలో నూరుశాతం కమిటీ వేయడంలో నాయకులు ఎంతో శ్రద్ధ తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు లోచల సుజాత, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు కొరుప్రోలు పాణీశాంతారామ్,మాజీ పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యన్నారాయణ, యూత్‌పార్టీ అధ్యక్షులు, రామకృష్ణనాయుడు, వైస్ ఎంపీపీలు సుర్ల బాజ్జి, జక్కు నాగమణి, రైతు విభాగం నాయకులు కొల్లు సత్యన్నారాయణ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ వాలంటీర్లు విభాగం అధ్యక్షులు పరవాడ కవిలేశ్వర్రావు, కసిరెడ్డి సత్యనారాయణతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ అనుబంధ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వితంతు, కొత్త పింఛన్లు ఎప్పుడిస్తారు..

మండల సమావేశంలో ఎమ్మెల్యేను నిలదీసిన సభ్యులు



ఎమ్మెల్యే బండారును నిలదీస్తున్న వైస్ ఎంపీపీ స్వాతి, సర్పంచ్ అప్పలనాయుడు

చీడికాడ : భర్తలు చనిపోయి రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు భార్యలకు వితంతు పింఛన్లు మంజూరు చేయలేదని, ఎప్పుడు మంజూరు చేస్తారో చెప్పాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని సభ్యులు నిలదీశారు. శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి, అప్పలరాజుపురం సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు, జైతవరం ఉపసర్పంచ్ ఈర్లి చైతన్య మాట్లాడుతూ నూతన పింఛన్లపై ప్రశ్నించారు. 50 ఏళ్లకే పింఛను అన్నారు.. కనీసం 60 నిండిన వారికి దిక్కులేదని వీరందరికీ ఎప్పుడు పింఛన్లు మంజూరు చేస్తారో చెప్పాలని నిలదీశారు. ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ 6 నెలల ముందు మరణించిన వారి భార్యలకు వితంతు పింఛన్లు అందించామని రెండేళ్లు, ఏడాది లోపు ఉన్న వారికి త్వరలో అందిస్తామన్నారు. అయితే కొత్త పింఛన్లు మంజూరుకు డబ్బులు లేవని ఇప్పట్లో వాటిని ఇవ్వలేమని తెల్చి చెప్పారు. పల్లె పండగ పనులకు సంబంధించిన నిధులు ఎప్పుడు విడుదల చేస్తారోనని టీడీపీ సభ్యులు అడగ్గా నెలరోజుల్లో వచ్చే అవకాశం ఉందన్నారు. విద్యుత్ ఏఈ వెంకటరావు మాట్లాడుతుండగా జైతవరం, దిబ్బపాలెం, అప్పలరాజుపురం, ఖండివరం సభ్యులు ఒక్కసారిగా అతనిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదని, రోజుల తరబడి కరెంటు లేకపోయినా పట్టించుకోలేదన్నారు. దీనికి ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ తీరు మార్చుకోకపోతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఏఈని హెచ్చరించారు. మండల ప్రత్యేకాధికారి మూర్తి, ఎంపీపీ జయమ్మ, ఎంపీడీఓ హేమసుందర్ రావు, తహసీల్దార్ లింకర్ పాల్గొన్నారు.

జెడ్.జోగుంపేటను సందర్శించిన డీటీ



డీటీకి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

రావికమతం : మండలంలో చీమలపాడు పంచాయితీ జెడ్.జోగుంపేట కేంద్రంగా జీసీసీ రేషన్ డిపో ఏర్పాటు చేయాలని, గిరిజన గ్రామాలైన అజేయపురం, పెదగరువు, రాయపాడు, రొచ్చుపనుకు, తాటిపర్తి, నేరెడుబంద, బంగారుబంద, కడగెడ్డ, గంగంపేట గ్రామాల గిరిజనులు సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. గోవిందరావు కలిసి శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ నేపథ్యంలో సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్ భాస్కరరావు స్పందించి శనివారం జెడ్.జోగుంపేట గ్రామాన్ని సందర్శించారు. గిరిజనులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కల్యాణపులోవ వెళ్లి రేషన్ తెచ్చుకోవాలంటే ఒక్క రోజు సమయం పడుతుందని, జెడ్.జోగుంపేటలో రేషన్ డిపో ఏర్పాటు చేస్తే చుట్టు పక్కల గ్రామాలకు 5 కిలోమీటర్ల పరిధిలోనే అందుబాటులో ఉంటుందని గ్రామస్తులు చిన్నరాజు, అప్పారావు,రాజేశ్వరి తదితరులు డీటీని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన డీటీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చారు.

వాలాబుకు మంచినీటి సరఫరా పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..



వాలాబులో నీటి సరఫరా చేస్తున్న దృశ్యం

దేవరాపల్లి : మండలంలోని గిరిజన పంచాయతీ వాలాబులో మంచినీటి సమస్యకు మోక్షం లభించింది. పంచాయితీ పరిధిలోని 14 శివారు గ్రామాలకు తాగునీరందించే మంచినీటి పథకం మోటారు మరమ్మతుకు గురికావడంతో స్థానిక గిరిజనులకు గెడ్డలో ఊటనీరు సేవిస్తూ ఇబ్బందులు పడ్డారు. దీంతో వాలాబులో '14 గ్రామాలకు ఊట నీరే గతి' శీర్షికతో ఈ నెల 15న సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కె. చంద్రశేఖర్ స్పందించారు. వాలాబు పంచాయతీలో మరమ్మతులకు గురైన మంచినీటి పథకాన్ని బాగు చేయించి శనివారం తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. నూతన ప్యానల్ బోర్డుతో పాటు మోటారు ఏర్పాటు చేసి 14 శివారు గ్రామాలకు మంచినీటిని సరఫరా చేశారు.

నేడు కె.జె.పురంలో మోదమాంబ జాతర

- భారీ ఏర్పాట్లు చేసిన ఉత్సవ కమిటీ
- విద్యుద్దీపాలంకరణతో ఉత్సవ వెలుగులు





గ్రామంలో విద్యుత్ దీపాలంకరణ, మోదమాంబ అమ్మవారు

మాడుగుల రూరల్ : కె.జె.పురం గ్రామస్తుల ఆరాధ్య దైవం, మోదమాంబ అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతి ఏటా ఆషాడ మాసం అమావాస్య ముందున ఈ జాతర నిర్వహించడం ఆనవాయితీ. గ్రామానికి చెందిన ఆడారి మోదినాయుడు కుటుంబీకులు మొదటిసారిగా పసుపు కుంకుమలు ఇవ్వడం ఆనవాయితీ. పూర్వం మాడుగుల సంస్థానధీశులు అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. ఆనాడు మాడుగులను పాలించిన రాజు వడ్డాది జగన్నాథ భూపతిదేవ్ వర్మ పేరు మీద కస్పా జగన్నాథపురం అనే పేరు వచ్చిందని ప్రతీతి. ఈ నెల 12 వ తేదీన అమ్మవారి పండగ చాటింపు వేశారు. 16వ తేది నుంచి ఘటాలు తిరగడం ప్రారంభించారు. అమ్మవారి ఇత్తడి ఘటాలను స్వర్గీయ ఆడారి మోదినాయుడు భార్య అప్పయ్యమ్మ గతంలో బహూకరించారు. ఆమె మనవడు యల్లపు వెంకట ఈశ్వర మోదినాయుడు (డాక్టరు) కుటుంబీకులు కంచు గొడుగు, అమ్మవారికి కిరీటం(వెండి), ఇతర ఆభరణాలు సమర్పించారు. ఆలయం శిథిలావస్థకు చేరడంతో 1995లో అప్పటి సర్పంచ్ కాళ్ల సూర్యనారాయణ గ్రామస్తులు, దాతల సహకారంతో ఆలయాన్ని పునర్‌నిర్మించారు. చెక్కతో తయారు చేసిన ఏలుఏనుగు మీద కామునాయుడు కుటుంబీకులు జాతర రోజు గ్రామ పురవీధుల్లో తిరగడం, జాతరలో ప్రత్యేకతసంతరించుకుంటుంది. ఆదివారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

జాతర సందర్భంగా గ్రామ ప్రధాన కళావేదిక మీద గ్రామానికి చెందిన హైదరాబాదు సినీ ఇండస్ట్రీ, వైజాగ్ సినీ ఇండస్ట్రీ, హైదరాబాదు వైన్స్ సిండికేట్ వారి సంయుక్త సహకారంతో డ్యాన్సు బేబీ డ్యాన్సు, గాంధీ వీధి, గణేష్ షాపు వద్ద, ఎస్సీ కాలనీ, దిబ్బవీధి తదితర చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 19వ తేదీ రాత్రి స్థానిక కళావేదిక వద్ద సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శిస్తున్నారు. ఆదివారం జాతర రోజు సాయంత్రం 4 గంటల నుంచి నేల నృత్యాలు, తీన్‌మార్ డప్పులు, కాళీమాత వేషాలు, చిటికెలు, తప్పెటగుళ్లు, భారీ మందుగుండు సామాగ్రితో అమ్మవారి ఊరేగింపు జరుగుతుందని ఉత్సవ కమిటీ వారు తెలిపారు. అలాగే జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం క్రికెట్ టోర్నీ నిర్వహించి, విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నారు.

భక్తులకు సదుపాయాలు కల్పించాం



అమ్మవారి జాతర సందర్భంగా ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం. గ్రామంలో విద్యుత్ దీపాలంకరణ చేశాం. ఆలయం వద్ద క్యూలో భక్తులకు అమ్మవారి ఆలయంలో ప్రవేశం కల్పిస్తున్నారు. దాతల సహకారంతో పులిహోర, మజ్జిగ వితరణ జరుగుతుంది. – రాపేట జోగినాయుడు, ఉత్సవ కమిటీ చైర్మన్, కె.జె.పురం